క్లుప్తంగా

అంబేడ్కర్ బాటలో నడవాలి



ఏరూరులో మనుధర్మ ప్రతులను దహనం చేస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

చిల్లకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాటలో ప్రతి ఒక్కరు నడవాలని కేఎన్‌పీఎస్ నాయకులు కే బాలయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ఏరూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం మనుధర్మ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1927లో మనుధర్మం చదివినా, వినినా దళితులపై దాడులు చేసేవారిని, అయితే అంబేడ్కర్ దాన్ని వ్యతిరేకిస్తూ మనుధర్మ ప్రతులను కాల్చి వేశారన్నారు. తిక్కవరంలోని దళితవాడలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పోలయ్య, రాఘవులు రవి, సురేంద్ర, భాస్కర్, వసంత్, జోషి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాయుడుపేటకు విజయసాయిరెడ్డి రాక

సూళ్లూరుపేట: వైఎస్సార్ సీపీ ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి విజయసాయిరెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు నాయుడుపేటలో పర్యటించనున్నట్టు ఎమ్మెల్యే సంజీవయ్య తెలిపారు. గోమతి సర్కిల్ వద్ద స్వాగతం పలికేందుకు నాయకులందరూ విచ్చేయాలని ఆయన ఓ ప్రకటనలో పిలుపు నిచ్చారు.

సబ్సిడీపై వరి విత్తనాలు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సహాయకులు

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు, వేళ్లపాళెంలోని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు, యూరియా, డీఏపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖాధికారులు మాట్లాడుతూ గతంలో రైతులు పట్టణ ప్రాంతాలకు వెళ్లి ఎరువులు, విత్తనాలు తీసుకుని వచ్చేందుకు వ్యయప్రయాసలకు గురి కావాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేలను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు అందుతున్నాయని, దీంతో బయట మార్కెట్ ధర కన్నా తక్కువకు ఉన్న ఊళ్లోనే లభిస్తున్నాయన్నారు. దీంతో రవాణా చార్జీలు ఆదా అవుతాయన్నారు. తూర్పుకనుపూరు, వేళ్లపాళెంలోని ఆర్బీకేల్లో డీఏపీ 260 బస్తాలు, యూరియా 400 బస్తాలు, వరి విత్తనాలు 300 బస్తాలు రైతులకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేళ్లపాళెం సర్పంచ్ ఆర్ వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా



బోల్తా పడిన టిప్పర్

సైదాపురం: ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో టిప్పర్ బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని ఊటుకూరు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. ఊటుకూరు నుంచి సైదాపురం గ్రామానికి వెళుతున్న టిప్పర్‌కు ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో ఒక్కసారిగా అదుపు తప్పి టిప్పర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోల్తా పడిన టిప్పర్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో బంగారు తిరుచ్చిపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం శ్రీకృష్ణ స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేక సేవ జరిపి, స్వామి అమ్మవార్లకు విశేషాలంకరణ చే శారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేశారు. సర్వాలంకార శోభితులైన స్వామి, అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై కొలువుదీరి, నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రుక్మిణీ సత్యభామ సమేత తిరుచ్చిపై కొలువైన దేవేరులను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలో మాసోత్సవాలు–2023ను పురస్కరించుకుని సోమవారం జరిగిన నృత్య ప్రదర్శన అలరించింది. పలు శివనామ కీర్తనలకు హైదరాబాద్‌కు చెందిన 40మంది కళాకారులు నృత్యం చేశారు. వారికి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రశంసాపత్రాలు, ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

నాయుడుపేటటౌన్: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



నాయుడుపేటటౌన్: విన్నమాలలో కేక్ కట్ చేసి వేడుకలు చేసుకుంటున్న క్రైస్తవులు



నాయుడుపేటటౌన్: సిస్టర్ వసంతకుమారి ఆధ్వర్యంలో ప్రార్థనలు



నాయుడుపేటటౌన్: బిషప్‌కు శాలువ కప్పి సత్కరిస్తున్న రఫీ



తడ: ప్రార్థనల్లో పాల్గొన్న సర్పంచ్ తుమ్మా జయప్రద



సేవాభావమే క్రీస్తుతత్వం



నాయుడుపేటటౌన్: ఎస్ఏఎల్‌సీ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవయ్య



చిల్లకూరు: కమ్మవారిపాళెంలో చర్చి ఆవరణలో క్రీస్తు పుట్టుక నాటికను ప్రదర్శిస్తున్న చిన్నారులు

నాయుడుపేటటౌన్: దయాగుణం, సేవాభావమే క్రీస్తు తత్వమని, అందుకు అణుగుణంగా సంఘ కాపరులు వ్యవహరిస్తుండడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేటలోని బేరిపేట ఎస్ఏఎల్‌సీ చర్చిలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. ముందుగా బిషప్ మైఖేల్ ఓ బెన్‌హర్‌ను ఎమ్మెల్యేకు శాలువ కప్పి, సత్కరించి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చర్చిలో అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే రాజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కే భవాన్ అనుదీప్, మెస్ భాస్కర్ రెడ్డి, పీ దశరథరామిరెడ్డి, కేఎంవీ కళాచంద్ర, కే బాబు రావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు చర్చి జరిగిన ప్రార్థనలు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు షేక్ రఫీ పాల్గొన్నారు. కాగా పట్టణంలోని పలు ప్రాంతాల్లోని చర్చిలు, ఇళ్ల వద్ద క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. బేరిపేటలోని సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చిలో రెవరెండ్ మైఖేల్ బెనహర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్కెట్ సమీపంలోని రోమన్ క్యాథలిక్ చర్చి, హెబ్రోను ప్రార్థనా మందిరం, విన్నమాలలోని జీసస్ గ్రేస్ చర్చి తదితర ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు.

లోక రక్షకుడు ఏసు క్రీస్తు

చిల్లకూరు: లోకంలోని పాపులను రక్షించేందుకు దేవుని కుమారునిగా భూమి మీద జన్మించిన రక్షకుడు ఏసుక్రీస్తు అని సోమవారం పలు చర్చిల సంఘ కాపరులు తెలిపారు. మండలంలోని మోమిడి, ఏరూరు, కమ్మవారిపాళెం, తిమ్మనగారిపాళెం, పల్లమాల, అన్నంబాక, ఓడూరు, చిల్లకూరు గ్రామంలోని లూథరన్ సంఘాలలో వాక్య సందేశం ఇచ్చి కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కమ్మవారిపాళెంలో లోగోస్ లూథరన్ చర్చిలో చిన్నారులు క్రీస్తు పుట్టుక నాటికను ప్రదర్శించారు. అలాగే పల్లమాలలో సంఘ కాపరి చిన్నారులకు స్వీట్లు పంచి పెట్టారు.

కోటలో..

కోట: మండలంలోని అన్ని చర్చిలు, ప్రార్థన మందిరాలు క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. విద్యానగర్ హోలీప్రేయర్ చర్చిలో బిషప్ ప్రదీప్‌కుమార్ తమ దివ్య సందేశాన్ని వినిపించారు. పేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. మహిళలు కొవ్వొత్తులు వెలిగించి శాంతి సందేశం వినిపించారు. రెవరెండ్ స్వరూప్‌డిన్నీ పాల్గొన్నారు.

తడలో..

తడ: క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం తడలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే సంజీవయ్య మండలంలోని తడ కండ్రిగ పంచాయతీలో చర్చికి వచ్చి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులతో కలిసి తడ కండ్రిగ సర్పంచ్ తుమ్మా జయప్రద శశికుమార్ ఇంటికి వెళ్లి విందు భోజనం చేశారు. తడ కండ్రిగ పంచాయతీ, అనపగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాజ్‌కుమార్ పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

పండ్లు పంపిణీ

ఓజిలి: మండలంలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కురుగొండ, ఓజిలి, రాచపాళెం, మానమాల తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు జరిపారు. కురుగొండ చర్చిలో డాక్టర్ అంకయ్య క్రైస్తవులు, వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు

పేదలకు, పిల్లలకు స్వీట్లు పంపిణీ

గూడూరురూరల్: క్రిస్మస్ సందర్భంగా గూడూరులోని లూథరన్ చర్చిలో సోమవారం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు కే రవీంద్రబాబు పేదలుకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

ఆనందంగా..

పెళ్లకూరు: మండలంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. పెళ్లకూరు, చిల్లకూరు, చెన్నప్పనాయుడుపేట, పాలచ్చూరు, చెంబేడు, పెన్నేపల్లె, శిరసనంబేడు, కొత్తూరు, అనకవోలు, అక్కగారిపేట తదితర గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీవీ సత్రం, ఏకొల్లు, రామారెడ్డికండ్రి, ముచ్చలుగుంట, కుప్పారెడ్డిపాళెం, ఆనేపూడి, నెలబల్లి, నెల్లూరుపల్లి తదితర గ్రామాల్లో చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

క్రిస్మస్ సంబరాలు

రాపూరు: మండలంలోని క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో ఉన్న పలు చర్చిల్లో క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

దక్కిలిలో..

దక్కిలి: మండలంలోని దక్కిలి, వెలికల్లు, చాపలపల్లి, దగ్గవోలు, చాకలపల్లె తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రత్యేక ప్రార్థనలు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని కాశీపేట లూథరన్ చర్చి, నాగులగుంటపాళెం, చింతగుంట, ఏపీటీఎఫ్‌కాలనీ, కోళ్లఫారం, కుమ్మరిగుంట, బంగారుపేట పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లోని పాస్టర్లు క్రీస్తు సందేశం ఇచ్చారు.

సైదాపురంలో..

సైదాపురం: మండలంలోని అన్నీ గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సైదాపురం, కలిచేడు, ఊటూకూరు, చాగణం, మర్లపూడి తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదానం చేశారు.



సైదాపురం: కలిచేడులో భక్తులకు క్రీస్తు సందేశం ఇస్తున్న పాస్టర్



కోట: విద్యానగర్‌లో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బిషప్ ప్రదీప్‌కుమార్



కోట: ప్రార్థనలు చేస్తున్న మహిళలు



చిల్లకూరు: పల్లమాలలో స్వీట్లు ఇస్తున్న పాస్టర్



ఓజిలి: కురుగొండ చర్చిలో దైవ సందేశమిస్తున్న పాస్టర్ భాస్కర్



వెంకటగిరిరూరల్: లూథరన్ చర్చిలో సందేశం వినిపిస్తున్న పాస్టర్



రాపూరులో క్రీస్తు బోధనలు చేస్తున్న సంఘ కాపరి



వెంకటగిరిరూరల్: చర్చిల్లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పెళ్లకూరు: క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు



గూడూరురూరల్: బిస్కెట్లు పంపిణీ చస్తున్న రవీంద్రబాబు

ఘనంగా ఏడీపీఎస్ వార్షికోత్సవం

వెంకటగిరిరూరల్: అంబేడ్కర్ ధర్మపోరాట సమితి (ఏడీపీఎస్) వారికోత్సవం సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఏడీపీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్ అధ్యక్షతన స్థానిక క్రాస్‌రోడ్డు సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జే వెంకటయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ సిద్ధాంతాలతో అధ్యయన తరగతులు నిర్వహించి, తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు అవగాహన కల్పించడమే ఏడీపీఎస్ ధ్యేయమన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు జీ గోపాల్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా నేటితరం పయనించాలని సూచించారు. సభా అధ్యక్షుడు నావూరు శంకర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలు అభ్యున్నతి దిశగా బీఆర్ అంబేడ్కర్ ఎనలేని కృషిచేశారన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి ఆశయ సాధన దిశగా ప్రతి ఒక్కరు కట్టుబడి పయనించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీపీఎస్ పట్టణ అధ్యక్షులు జై భీమ్ హరి, ఏడీపీఎస్ నాయకులు చంద్ర, నాగేష్, చందు, ప్రసాద్, రవి, సాయికృష్ణ , వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏడీపీఎస్ నేతలు

‘ఆడుదాం ఆంధ్ర’కు మైదానం సిద్ధం



డిగ్రీ కళాశాలలో సిద్ధం చేసిన మైదానం



జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాగంణం వద్ద పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు మైదానం సిద్ధం చేశామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మురళి తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఎనిమిది సచివాలయాల పరిధిలోని క్రీడాకారుల పేర్లు రిజిస్టర్ చేశామన్నారు. వీరికి కోటపోలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, కోటపోలూరు ఈస్ట్ దళితవాడ ఎంపీపీఎస్ పాఠశాల, కొమ్మినేనిపల్లెలోని ఎంపీపీఎస్ పాఠశాల, దామానెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, కేసీఎన్‌గుంట సచివాలయ పరిధిలోని క్రీడాకారులకు సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాగ్నపట్టెడ జెడ్పీ ఉన్నత పాఠశాల, మంగళంపాడు జెడ్పీ హైస్కూలు, సుగ్గపల్లెలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో మైదానాలు సిద్ధం చేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలను దిగ్విజయం చేయండి

నాయుడుపేటటౌన్: ఆడుదాం ఆంధ్ర పోటీలను దిగ్విజయం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు కోరారు. మంగళవారం నుంచి జరగనున్న పోటీలకు పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలాన్ని సిద్ధం చేసే పనులను సోమవారం చేపట్టారు. పట్టణంలోని ఏఎల్‌సీఎం ఆటస్థలం, బీఎంఆర్ నగర్‌లో ఉన్న క్రీడా ప్రాంగణాలను సైతం పలు క్రీడలకు సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపాలిటీలోని 13 సచివాలయాల పరిధిలో క్రీడాకారులు ఎంపిక పూర్తి అయ్యిందన్నారు.

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడి

సైదాపురం: వెంకటగిరి నియోజకవర్గంలో మామిడి సాగు విస్తారంగా ఉందని, ఈ పంటలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వెంకటగిరి ఉద్యానవన శాఖాధికారి ఆనంద్ చెబుతున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, బాలాయపల్లె, డక్కిలి, రాపూరు, కలువాయి, వెంకటగిరి మండలాల్లో ప్రస్తుతం 2 వేల హెక్టార్లలో పంట సాగులో ఉందన్నారు. ప్రధానంగా బంగినపల్లి రకం తోటలకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. సస్యరక్షణ చర్యలు ఆయన మాటల్లోనే..

ఇవి పాటించాలి

సాధారణంగా మామిడి పూత డిసెంబర్ –జనవరి నెల మధ్య ప్రారంభమవుతుంది. ఈ సమయంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి అవశ్యకత ఎంతైనా ఉంది.

- అక్టోబర్ ప్రారంభం నుంచి నీటి తడులు ఆపి, నీటి ఎద్దడి కల్పించడం ద్వారా పూత ఏక కాలంలో తెప్పించవచ్చు.
- నవంబర్‌లో పోటాషియం నైట్రేట్ లీటరు నీటిని 10 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.
- జనవరి 15 నుంచి తేలికపాటి నీటి తడులు ఇవ్వడం ద్వారా ఫలదీకరణ సులువుగా జరుగుతుంది.
- పూత, మొగ్గ దశలో బోరాన్ 200 గ్రాములు 100 లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- మామిడి పిందె పరిణామంలో ఉన్నప్పుడు నాఫ్తలిన్ ఎసిటిక్ యాసిడ్ 2 గ్రాములు 100 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- దీంతో పూత, పిందె బాగా నిలుస్తుంది. నిర్ణీత మోతాదుల్లోనే వాడాలి. లేకుండా పిందె దెబ్బతినే అవకాశం ఉంది.
- కాయ నిమ్మకాయ పరిణామంలో ఉన్నప్పుడు పోటాషియం నైట్రేట్ లీటర్లు నీటికి 10 గ్రాములు చొప్పున కలిపి 15 రోజులకు రెండు సార్లు చెట్లకు పిచికారి చేయాలి. ఇలా చేస్తే పూత నిలిచే అవకాశాలు మెండుగా ఉంటాయి.



పూతలో ఉన్న మామిడి చెట్లు

తేనే మంచు పురుగుతో జాగ్రత్త

ఫిబ్రవరిలో పూత దశలో తేనే మంచు పురుగు రసం పీల్చడం ద్వారా పూత, పిందె రాలిపోతుంది. తేనే వంటి పదార్థాన్ని విసర్జించడం ద్వారా సూర్యకాంతిలో మెరుస్తుంది. తద్వారా ఈ పురుగును గుర్తించవచ్చు. నివారణకు డిసెంబర్‌లో పూత, మొగ్గ రాక ముందు ప్రొపనోఫాస్ 1.5 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

తామర పురుగు

తామర పురుగు లేత ఆకులు, పూతకు రెమ్మలు విచ్చుకునే దశలో రసం పీల్చడంతో ఆకుల పరిమాణం తగ్గి రాలి పోతాయి. కాయ పిందెలపై కూడా రసాన్ని పీల్చడంతో నాణ్యత తగ్గి, మంగులా కన్పిస్తాయి. తద్వారా మార్కెట్‌లో కాయల ధరలు పూర్తిగా పడిపోతాయి. నివారణకు విప్రోనిల్ 0.3 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

బూడిత తెగుళ్లు

జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి చివరి వారం వరకు వ్యాపించే అవకాశం ఉంది. ఈ తెగులు సోకితే తెల్లటి పొడి వంటి పదార్థం పూత, రెమ్మల మీద రసం పీల్చి పూత పిందె రాలిపోతుంది. నివారణకు డిసెంబర్ నెలలోనే ఉదయం సాయంత్రం నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

సూచనలు, సలహాలు రైతులు తప్పనిసరి



పూత దశలో ఎక్కువగా గొంగలి పురుగు ఆశించే అవకాశం ఉంది. పూత, పిందె, కాడలకు ఈ పురుగు సోకి పంట దెబ్బతినే అవకాశం ఉంది. ఇలాంటప్పుడు మందులు వాడకం మంచిది కాదు. అధికారులు సలహాలు, సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలి. లేదంటేనే పూత దశలోనే పంటకు నష్టం జరిగే అవకాశం ఉంటుంది.

–ఆనంద్, ఉద్యానవనశాఖాధికారి, వెంకటగిరి

ట్రాక్టర్‌ను ఢీ కొన్న టెంపో



నుజ్జునుజ్జు అయిన టెంపో



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఐదుగురికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను టెంపో వాహనం వెనక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో టెంపో ముందు భాగం నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలుకు చెందిన 12 మంది టెంపోను అద్దెకు తీసుకుని అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆదివారం సాయంత్రం బయలుదేరారు. ఈ క్రమంలో సోమవారం వేకువజామున చిల్లకూరు పోలీస్ స్టేషన దాటి కొద్ది దూరంలో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి టెంపో ఢీ కొంది. దీంతో ట్రాక్టర్ పక్కనే గోతిలోకి దిగి పోగా టెంపో ముందు భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో టెంపోలో ప్రయాణిస్తున్న పవన్‌కుమార్, తులసీరత్నంకు తీవ్రగాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే ఎస్ఐ అంజిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలను సేకరించి క్షతగాత్రులను 108 ద్వారా గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఎస్ఐ మాట్లాడుతూ పొగమంచు ఎక్కువగా ఉన్న కారణంగా టెంపో డ్రైవర్ ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను సరిగా గుర్తించలేక ఢీ కొని ఉండవచ్చన్నారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.